క్లుప్తంగా

మిర్చి రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల: మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (సీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొణిజర్లలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన మిర్చికి ధర లేక రైతులు అప్పుల పాలయ్యారన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు రమేష్, సీతారాములు, పరశురాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

బోనకల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫిజికల్ సైన్స్‌పై విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఆంగ్ల మాధ్యమంలో బోనకల్ పాఠశాలకు చెందిన జె.సాయి జశ్వంత్, బ్రాహ్మణపల్లికి చెందిన జి.ఉమాశ్రీ, బోనకల్‌కు జి.మనస్విని మొదటి మూడు బహుమతులను గెలుచుకున్నారు. తెలుగు మాధ్యమంలో చిరునోముల పాఠశాలకు చెందిన వెంకట శివతేజ, కేజీబీవీ పాఠశాలకు చెందిన శైలు, నందినిలు మూడు బహుమతులు గెలుచుకున్నారు. ఈ విద్యార్థులకు కన్వీనర్ సురేష్‌కుమార్, హెచ్ఎం గోపీచంద్ బహుమతులు అందించారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలస్థాయిలో జరిగిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియం విభాగంలో రేజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని పంతంగి లక్ష్మీప్రసన్న మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు లక్ష్మీప్రసన్నకు అభినందనలు తెలిపారు.

కేంద్ర విధానాలను ఎండగట్టాలి

తల్లాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని తెలంగాణా రాష్ట్ర సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. శుక్రవారం తల్లాడలో నిర్వహించిన మార్కెట్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గంపై కక్షగట్టి 44 చట్టాలను మార్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రమ్య, సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్.కె.మస్తాన్, రామలింగేశ్వరరావు, కృష్ణయ్య, కృష్ణ పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలకు న్యాక్ 'బీ' గ్రేడ్

సత్తుపల్లిరూరల్: మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలకు న్యాక్ 'బీ' గ్రేడ్ లభించిందని కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు తెలిపారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఫార్మసీ కళాశాలలో న్యాక్ గుర్తింపు పొందిన మొదటి కళాశాల తమదేనని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ కంచర్ల సత్యనారాయణతో పాటు చలసాని హరికృష్ణ, జయవరపు కుమార్‌రాజా, కందిమళ్ల కృష్ణారావు, ప్రవీణ్‌కుమార్ తదితరులు కరస్పాండెంట్, అధ్యాపకులను అభినందించారు.

వాసవీ క్లబ్ వైభవం నూతన కమిటీ ఎన్నిక

వైరా: వైరా పట్టణ వాసవీ క్లబ్ వైభవం నూతన కమిటీని శుక్రవారం వైరాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా రాయల నాగేశ్వరరావు, కార్యదర్శిగా గొండేల రవి, కోశాధికారిగా మైలవరపు శ్రీనివాసరావు, జిల్లా ఆఫీస్ బేరర్‌గా గ్రంధి ప్రవీణ్, జిల్లా జాయింట్ సెక్రటరీగా పెనుగొండ ఉపేందర్‌రావులు నియమితులయ్యారు. వీరికి వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు ఎన్నిక ధృవపత్రాలను అందిచారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు వరప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యను బలోపేతం చేయాలి

బోనకల్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర సభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఫిబ్రవరి 4,5 తేదీల్లో భద్రాచలంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పృథ్వీ, సందీప్, స్పందన, అనూష, అలైఖ్య, నవీన్, ప్రసాద్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీని జయప్రదం చేయాలి

బోనకల్: తెలంగాణ జనసమితి మూడో ప్లీనరీని జయప్రదం చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర సహాయకార్యదర్శి గోపగాని శంకర్‌రావు కోరారు. శుక్రవారం బోనకల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో ఫిబ్రవరి 2న నిర్వహించే ప్లీనరీకి ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సద్దార్, నాగేంద్రబాబు, నరసింహారావు, మోహన్, సత్యనారాయణ, కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ధర.. దిగాలు



మిరప తోటలో కాయలు కోస్తున్న కూలీలు



ముమ్మరంగా మిర్చి కోతలు

- 6 వేల ఎకరాల్లో మిర్చి సాగు
- ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వలస
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన
- కూలి ఖర్చులు కూడా రానివైనం

తల్లాడ: ఖరీదైన వాణిజ్య పంట ఎర్ర బంగారం సీజన్ వచ్చింది. తల్లాడ మండలంలో మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. గత ఐదు నెలల క్రితం సాగు చేసిన మిర్చి మొదటి కోతలు ఆరంభమయ్యాయి. గత ఏడాది జులై నెలాఖరు, ఆగస్టు మొదటి వారంలో సాగు చేసిన మిర్చి తోటలు ఐదు నెలల వరకు ఎలాంటి చీడీ పీడలు ఆశించకుండా ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ఈ ఏడాది మిర్చి దిగుబడిపై ఆశలు పెంచుకున్నారు. తీరా మిర్చి కాపు దశలో నల్లి ఆశించింది. ఎర్రనల్లి, నల్ల నల్లి ఆశించి మిర్చిలో రసం పీల్చుతూ దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

ఆందోళనలోరైతులు..

వాణిజ్య పంటైనా మిర్చికి ధర ఉంటేనే రైతుకు లాభాలు వస్తాయి. ధర లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మిర్చి రూ.13 వేల లోపు నడుస్తోంది. మిర్చి కోతలు ప్రారంభమైనప్పటి నుంచి ధరలో రోజురోజుకు తేడా వస్తోంది. కోతల ఆరంభంలో రూ.18 వేలు క్వింటా మిర్చి ధర పలకగా ప్రస్తుతం రూ.13 వేలు నుంచి రూ.14 వేలు లోపే పలుకుతుంది. గత సంవత్సరం ఇదే సీజన్‌లో క్వింటా మిర్చి ధర రూ.24 వేలు పలికింది. సగానికి సగం ధర పడిపోయింది.

కూలీల కొరత

తల్లాడ మండలంలో 6 వేల ఎకరాల్లో మిరప తోటలు సాగు చేశారు. తేజస్వీ సన్న రకాలు, లావు రకాలను సాగు చేశారు. మండలంలో సన్న రకాలనే ఎక్కువగా సాగు చేశారు. ఈ ఏడాది రబీ వరినాట్లు ఓ పక్క ముమ్మరంగా జరుగుతున్నాయి. వరి నాట్లుకు కూలీలు వెళ్లడం వల్ల మండలంలో మిర్చి కోతలకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను పిలిపించారు. కిలో మిర్చికి రూ.10 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఎకరానికి రూ.5 వేలు చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఆ పంటను రైతుల పొలాల్లోనే కల్లాలు చేసి ఆరబోశారు.

తాలు కూడా అధికమే..

ఈ ఏడాది మిర్చిలో తాలు కూడా బాగా వస్తుంది. మొదటి కోతలో తాలు తక్కువగా వెళ్లాల్సి ఉండగా ఎక్కువగా వెళ్తుంది. ఇది కూడా రైతులకు నష్టాన్ని చేకూర్చే అంశమే. తాలు ఎక్కువగా రావడం వల్ల ఒరిజనల్ కాయల దిగుబడి తగ్గిపోతుంది.

దిగుబడి తగ్గింది.



మిర్చి తోటల్లో కాపు దశలో ఎర్ర నల్లి, నల్ల నల్లి ఆశించి నష్టం చేస్తుంది. దీంతో ఈ ఏడాది మిర్చిలో దిగుబడి తగ్గుతుంది. అంతేకాక మిరపకాయల్లో తాలు కూడా బాగా వస్తుంది. దీనికి తోడు ధర లేక పోవటం వల్ల పెట్టుబడులు కూడా వస్తాయో రావోననే సందేహం కలుగుతుంది. మొదటి కోతలోనే దిగుబడి అంతంత మాత్రంగా ఉంది.

– నరాల వెంకటేశ్వరరెడ్డి, రైతు, తల్లాడ

కూలీల కొరత ఉంది..



ఈ ఏడాది తొలిసారిగా ఎకరం భూమిలో మిర్చి సాగు చేశాను. కాపు బాగానే ఉన్నప్పటికీ కూలీల కొరతతో పొరుగు మండలం నుంచి లేదా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుంచి కూలీలను వలస తెచ్చుకోవాల్సి వస్తుంది. కిలో మిర్చి కాయలు తీస్తే రూ.10 చెల్లిస్తున్నా.. కూలీల కొరత తీరటం లేదు. కూలీలకు బాగా ఖర్చవుతుంది.

– జి.రాంబాబు, రైతు, తల్లాడ

తెగుళ్లతో తగ్గిన దిగుబడి

ఈ ఏడాది మిర్చి కాపు దశలో తోటల్లో ఎర్ర నల్లి, నల్ల నల్లి ఆశించింది. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎకరానికి 15 క్వింటాళ్లు దిగుబడి వస్తుందనుకున్న రైతులకు పది క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ఎకరానికి 1.50లక్షలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఈ ఏడాది నట్టేట మునిగిపోతున్నారు. తెగుళ్ల కారణంగా దిగుబడిపై ప్రభావం పడగా ఇటు ధర లేక మరో పక్క రైతులు నష్టాన్ని చవి చూడాల్సి వస్తోంది.



మొదటి కోతలో వచ్చిన తాలు కాయలు

ఉద్యమించే సమయం ఆసన్నమైంది..



మాజీ మున్సిపల్ చైర్మన్, పాలకవర్గంతో సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: హామీల అమలు కోసం ప్రభుత్వానికి ఇచ్చిన ఏడాది గడువు ముగిసిన నేపథ్యాన ఇకపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఇటీవల పదవీకాలం ముగిసిన సత్తుపల్లి మున్సిపల్ పాలకవర్గాన్ని శుక్రవారం సన్మానించి మాట్లాడారు. చారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశానని తెలిపారు. ఇప్పుడు సత్తుపల్లిలో ఏ పని చేయాలన్నా 'డీ'ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు డీఎంఎఫ్‌టీ నిధులు ఎమ్మెల్యే జేబులోకి వెళ్తున్నాయని దుష్ప్రచారం చేయగా, ఇప్పుడు నిధులు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం జమ చేసుకున్నా నోరు మెదపడం లేదని పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గం ముగిసి మూడు రోజులు గడవక ముందే ఏడుగురి సిబ్బందిని తొలగించారని, ఎన్నికల కోడ్ ఉన్నా అధికారులను బదిలీ చేశారని విమర్శించారు. స్టేడియం, క్రైస్తవ భవనం, వేశ్యకాంతల చెరువు ఆధునికీకరణ పనులు ఎందుకు నిలిపివేశారు, రజకుల కోసం నిర్మించిన భవనంలో ఇతర నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారో చెప్పాలన్నారు. కాగా, సత్తుపల్లి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దిన మున్సిపల్ పాలకవర్గాన్ని సండ్ర అభినందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు, ఎస్.కే.రఫీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, మల్లూరు అంకమరాజు, అద్దంకి అనిల్, ఎస్.కే.అయూబ్‌పాషా, అమరవరపు విజయనిర్మల, వీరపనేని రాధికబాబి, మేకల భవాని, ఎస్.కే.చాంద్‌పాషా, గుండ్రు రాఘవేంద్ర, మారుతి సూరిబాబు పాల్గొన్నారు.

సన్మానాలు..



ముళ్లపాటి సీతారాములు, విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కేటీఆర్

వైరా: వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన బీఆర్‌ఎస్ నాయకుడు ముళ్లపాటి సీతారాములు, విజయలక్ష్మి దంపతులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం హైదరాబాద్‌లోని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్‌కు..



మొండితోక లత, జయాకర్ దంపతులను సన్మానిస్తున్న కేటీఆర్, తదితరులు

మధిర: హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మధిర మున్సిపల్ తాజా మాజీ చైర్‌పర్సన్ మొండితోక లత, జయాకర్ దంపతులను సన్మానించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రదర్శనగా తరలివస్తున్న వాసవీ మాత భక్తులు



వాసవీ మాత

మధిర: మధిర శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా గురువారం పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు వేదమంత్రాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గ్రేటర్ వాసవి క్లబ్, వనిత వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మధిర మెయిన్ రోడ్ లోని వినాయకుడి గుడి నుంచి అమ్మవారి పసుపు కుంకుమలు, చీర, సారెతో ప్రదర్శనగా తరలి వెళ్లారు. ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య మహిళలు వాటిని అమ్మవారికి సమర్పించారు. బెంగళూరు వాసవీ సిస్టర్ల ఆధ్వర్యంలో పాటల కార్యక్రమం జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

తల్లాడ: తల్లాడలోని వాసవీ కల్యాణ మండపం నుంచి ఆర్యవైశ్యులు వాసవీ మాత చిత్రపటంతో శుక్రవారం ర్యాలీ చేసి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నంబూరి మోహన్‌రావు, కేతేపల్లి భాస్కర్‌రావు, జవ్వాజి నగేష్, నేరెళ్ల చిన్న స్వామి, అనుమోలు సర్వేశ్వరరావు, బాబు, కొత్తూరు సతీష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా నర్సింహ



కమిషనర్ నర్సింహ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కొండ్ర నర్సింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ మందా రవిబాబు వనపర్తి జిల్లా అమరచింతకు బదిలీ చేయగా వెళ్లారు. నూతన కమిషనర్ గతంలో గద్వాల, జనగాం, పరకాలలో పని చేశారు. దీంతో నర్సింహకు మేనేజర్ మైసా శ్రీనివాసరావు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నాయబ్ తహసీల్దార్‌గా ఉపేందర్..



ఉపేందర్

ముదిగొండ: ముదిగొండ నాయబ్ తహసీల్దార్‌గా ఉసికల ఉపేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం డీవైఎస్‌ఓ కార్యాలయం నుంచి ముదిగొండ తహసీల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు.

చింతకాని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రమాదేవి..

చింతకాని: చింతకాని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బోనకల్ మండల ఎంపీడీఓ రమాదేవి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. చింతకాని ఎంపీడీఓగా పనిచేస్తున్న రామయ్య ఉద్యోగ విరమణ పొందటంతో రమాదేవికి బాధ్యతలు అప్పగించారు.

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు



మానవహారంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందని సత్తుపల్లి ఎంవీఐ జేఎస్ శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా పోలీస్‌శాఖ, ఆర్టీసీ, గంగారం ప్రత్యేక బెటాలియన్ అధికారులు, విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రింగ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి.. రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎంవీఐ దినేష్, ఎస్సై రఘు, ప్రైవేట్ పాఠశాల జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, బెటాలియన్ అధికారులు భాస్కర్, సునీల్‌కుమార్, తిరుపతి, ఆర్టీసీ సూపర్‌వైజర్లు వెంకటయ్య, కిన్నెర ఆనంద్, ప్రైవేట్ విద్యా సంస్థల డివిజన్ బాధ్యులు పి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవన నిర్మాణ పనులను శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న డీఆర్, నగదు రహిత వైద్యం, పీఆర్‌సీ వంటి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యాలయ భవనం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, కృష్ణయ్య సూరీ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏదునూరి సీతారాములు, కట్ల రంగారావు, మేదరమెట్ల సుబ్బయ్య, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పాలసీ బీమా చెక్కు అందజేత

రూ.2లక్షల బీమా..



బీమా నగదు అందిస్తున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంకు చెందిన షేక్ ఛాంద్‌మియా ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద పాలసీ తీసుకున్నాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బీమా రూ.2లక్షల చెక్కును శుక్రవారం ఖమ్మం డివిజన్ ఎస్పీ వీరభద్రస్వామి మృతుడి భార్య రజియా బేగంకు అందజేశారు. కార్యక్రమంలో ఐపీఓ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

- కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి పోస్ట్ ఆఫీస్‌లో చిన్నల త్రివేణి రూ.11వేలు చెల్లించి.. లక్ష రూపాయల బీమా పాలసీ తీసుకుంది. ఆమె ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. లక్షా పదిహేనువేల రూపాయల పాలసీ చెక్కును శుక్రవారం పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ మృతురాలి భర్త అశోక్‌కు అందించారు. ఎస్‌పీరామకృష్ణ, బీపీఎం కోమలి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

ఏన్కూరు: మండలంలోని నూకలంపాడులో శ్రీ సోమలింగేశ్వర ఆలయం పంచమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష పదివేల 116 శివలింగాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. లక్ష రుద్రాక్షలతో అభిషేకాలు, 120 కేజీలతో అన్నాభిషేకం, హోమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వడ్డే నర్సింహారావు, మద్దినేని నవీన్, బొంతు సూర్య, చంద్రం, మద్దినేని కార్తీక్, అనీల్, వెంకట్, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం, కృష్ణశర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రాగమయికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కల్లూరు: మండలంలోని కిష్టయ్యబంజర్ వాసులు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కిష్టయ్యబంజర్, వీ.బీనగర్‌ల్లో తాగునీటి సమస్య ఉందని, గ్రామంలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. అలాగే, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై వినతిపత్రంలో పేర్కొన్నారు. నాయకులు నర్సింహారావు, పురుషోత్తమచారి, రాణి, శ్రీను, పుల్లాచారి, ఎస్.శివాజీ, లెనిన్, మారయ్య, ఇజ్జమ్మ, సాహసచారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

ఎర్రుపాలెం: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర ఉటుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు యడవల్లి సత్యనారాయణ సన్మాన సభను నిర్వహించగా.. నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు కాపాడాలని, ఉపాధ్యాయులు సైతం కాపాడుకునే దిశగా పోరాటం చేయాల్సిఉందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళీమోహన్‌రావు, సంఘం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, సండ్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బరామరాజు, నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

హెచ్ఎం కిషన్‌రావుకు..



కిషన్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చింతకాని: మండలంలోని రాఘవాపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బీవీ కిషన్‌రావుకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రావు దంపతులను ఎస్టీఎఫ్, టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వీరపనేని శ్రీనివాసరావు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఈజీఎస్ సిబ్బంది, ఎఫ్ఏలు


కొణిజర్ల: ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను అందించాలని కొణిజర్ల మండల ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం ఎంపీడీఓ ఏ.రోజారాణి, ఏపీఓ అమ్మజాన్ లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలందక ఈజీఎస్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ ఉద్యోగులకు చట్టభద్రత కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ హేమలత, ఎఫ్ఏ లు నాగేశ్వరరావు, సునీల్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- కారేపల్లి: వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని ఈజీఎస్ సిబ్బంది శుక్రవారం సింగరేణి ఎంపీడీఓ సురేందర్‌కు వినతిపత్రం అందించారు. ఉపాధిహామీ రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఈసీ సుధీర్, టీఏ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పార్వతి, వసంత్, నాగేంద్రబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు ఖలీల్, అరుణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
- సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో ఈజీఎస్ సిబ్బంది పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తమకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీఓ బాబురావు, ఈసీ గాయం నాగశ్రీను, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, వీరభద్రం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25,116 వితరణ

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ద్వారకాపురికాలనీ రోడ్ నంబర్ 7లో నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి చిన్న నాగయ్య జ్ఞాపకార్థం.. వేషమ్మ, కోనేరు కోటేశ్వరరావు జ్ఞాపకార్థం.. బేబి సరోజిని, విద్యాభారతి కళాశాల యాజమాన్యం మందడపు సత్యనారాయణ, సుజని, మార్క్‌మాన్ శిలా, లావణ్యలు రూ.25,116లను శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

మధిర: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కుష్ఠువ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ మాట్లాడుతూ.. శరీరంపై మొద్దు బారిన, నొప్పి లేని, స్పర్శ లేని, రాగి వర్ణం, గోధుమ రంగు మచ్చలు ఉంటే వెంటనే పారామెడికల్ సిబ్బంది ద్వారా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. దెందుకూరు, ఖమ్మంపాడు తదితర గ్రామాల్లో అవగాహన కల్పించి.. కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, విజయరాజు, లెప్రసీ మండల నోడల్ పర్సన్ లంకా కొండయ్య, వైద్య సిబ్బంది వడ్లమూడి వెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మి భారతి, రత్నమాల, రాజేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.